# దైవప్రేమకు మించిన ప్రేమ జగత్తులో లేదు

ఉద్యోగములు చేయనువిదలందరు పోవ
గృహ కృత్యములు దీర్చు గృహిణులెవరు?
ఆల్మగలిరువురు ఆఫీసులకుబోవ
ఇంటి పనులుజేయు ఇంతులెవరు?
పర బాలురకు నేర్ప పాఠశాలలకేగ
తమ బాలురకు నేర్పు తల్లులెవరు?
పుస్తకాల్ చేబట్టి పురుషులవలె బోవ
వంటయింటిని దిద్దు వనితలెవరు?
డబ్బు వలన కలుగు యిబ్బంది తీరిన
ఇంటిలోని కొరతలెంతయుండు
సుఖము చూడబోవ సున్నయే యుద్యోగ
పదవియందునున్న పడతికెపుడు.

దివ్యాత్మ స్వరూపులారా!

ప్రాచీన ఋషులు జీవితమును మధురభావముగా భావిస్తూ వచ్చారు. ఈ మధుర భావమే మానవునియందు శూన్యమైన, జీవితము అంధకారముగా తోస్తుంది. స్వార్థమువల్లగానీ, స్వప్రయోజనమువల్లగానీ ఈ మాధుర్యము మానవునియందు ఆవిర్భవించదు. దివ్యమైన, భవ్యమైన, త్యాగముచేతనే మానవునియందు ఈ మాధుర్యము అభివృద్ధి గాంచుతుంది. ఐహికమునందుగానీ, ఆముష్మికమందుగానీ, ప్రాకృతమునందుగానీ, పరాకృతమునందుగానీ ఈ దివ్యమైన మాధుర్యమే మానవుని సంరక్షిస్తూ వస్తుంది.

sri sathyasai vahanamrutam

**భగవంతుని అభీష్టమును గుర్తించి వర్తించటము మానవునకు కష్టమైన పని**

ప్రతి మానవునియందుండిన ఈ మాధుర్యమనే తత్వాన్ని, శక్తిని కాపాడుకొనుటకు తగిన ప్రయత్నము చేయాలి. ఇటువంటి త్యాగము, పవిత్రమైన మాధుర్యము ఒక్క మాతృమూర్తియందు మాత్రమే మనకు లభ్యమవుతుంది. బిడ్డల నిమిత్తమై మాతృమూర్తి తన జీవితమైనను త్యాగము చేసి వారిని సంరక్షించుటకై అనేక ప్రయత్నములు చేస్తుంది. కనుక, అట్టి మాతృమూర్తి త్యాగమును గుర్తించి వర్తించటమే ప్రతి మానవుని ప్రధాన కర్తవ్యము. అట్టి త్యాగము ఒక్క మాతృమూర్తియందు మాత్రమే మనకు గోచరిస్తుంది. అందువల్లనే 'మాతృదేవోభవ, పితృదేవోభవ', అని ప్రాచీన ఉపనిషత్తులు బోధిస్తూ వచ్చాయి. ఈ ప్రేమకై తన జీవితమును త్యాగము చేయటముచేత ఆమెకు 'మాతృదేవోభవ' అనే సార్థకనామము లభ్యమైంది. తల్లిదండ్రులెక్కడ ఉందురో అక్కడనే దైవము ఉంటాడని వేదముయొక్క ప్రమాణము. దైవారాధనచేత ఏ విధమైన ఫలితములు పొందుచున్నారో అట్టి ఫలితములు ఈ తల్లిదండ్రులను ప్రేమించటంచేత పొందుతున్నాడు, మానవుడు. నిజముగా దైవారాధన సులభమైనదికాదు. లోకములో కోటానుకోట్లమంది దైవారాధన సల్పి తమ అభీష్టములను నెరవేర్చుకొనుటకు అనేక ప్రయత్నములు చేస్తున్నారు. దైవారాధన చాలా కష్టమైనది. దైవము మానవుని అభీష్టమునకు అతీతమైనవాడు. దైవముయొక్క సంకల్పమును మానవుడు గుర్తించుకోలేడు. ఎట్టి ఆరాధనలకు భగవంతుడు ఆనందిస్తాడో గుర్తించుకోటానికి వీలుకాదు. మానవుని భావమునకు అతీతమైనవాడు భగవంతుడు. కనుక అతని అభీష్టము గుర్తించి వర్తించటము మానవునికి కష్టమైనటువంటిది.

**ఏది చేస్తే తల్లితండ్రులకు ఆనందము కలుగుతుందో గుర్తించి వర్తించటమే బిడ్డలయొక్క కర్తవ్యము**

నిజముగా తల్లితండ్రుల భావములు, తల్లితండ్రుల అభీష్టములు ఎట్టివి అనేది ప్రతి కుమారునకు, కుమార్తెకు తెలుస్తుంది. ఏ విధముగా ప్రార్థనచేస్తే తల్లితండ్రులకు ఆనందము కలుగుతుందో అట్టి భావమును గుర్తించి వర్తించటమే బిడ్డలయొక్క కర్తవ్యము. ఈ భావమునకు అతీతమైన దైవత్వము ప్రకటించటంచేత నీకు ఎట్టి అభీష్టము

sri sathyasaivachanamrutam

నెరవేర్చుటకు వీలుకాదు. ఆ దైవమునకు ఏది ప్రీతికరమైనదో ఏది ఆనందకరమైనదో ఏది ఉల్లాసకరమైనదో గుర్తించి వర్తించినప్పుడే నీ అభీష్టము నెరవేరుతుంది. కనుక, దైవాభీష్టమును గుర్తించి వర్తించే జీవితమును మనము అభివృద్ధిపరచుకోవాలి. మనము పాఠశాలలకేగి ఈ విద్యను అభ్యసించుటకు వీలుకాదు. లేక మరి యే గ్రంథమునందైనా విచారించి అనుభూతిలో పెట్టుటకు వీలుకాదు. కేవలము స్వయంఅనుభూతిచేత యిట్టి పవిత్రభావము ఏర్పడుతుంది. ఒకానొక సమయములో తల్లిదండ్రుల ఆజ్ఞను శిరసావహించి యిదియే దివ్యమైన మార్గమని భావించి ప్రపంచమునకు ఆదేశించినది, రామాయణము. తండ్రికి యిచ్చిన వాగ్దానము నెరవేర్చే నిమిత్తమై కుమారుడైన రాముడు రాజ్యాధికారముకూడా త్యాగము చేసి అడవులలో ప్రవేశించాడు. 'తండ్రీ! నేను అడవులకు పోవుటకు ఎట్టి అనానుకూలములేదు. నీ సత్యమును పాలించుటమే నా ప్రధాన కర్తవ్యము. తండ్రి అభీష్టము నెరవేర్చుటయే కుమారుని కర్తవ్యము. కనుక ఆనందముతో అరణ్యమునకు వెడుతున్నాను', అని చెప్పాడు. యింతటి ప్రేమ, విశ్వాసములు కల్గిన కుమారుడు ప్రపంచమునకు ఆదర్శవంతమైన శక్తిగా రూపొందాడు. రాముడు అరణ్యములో ఉండినప్పుడు భరతుడు తన పరివారముతో అరణ్యములో ప్రవేశించి రాముల పాదములు పట్టి తిరిగి అయోధ్యకు రావాలని అనేక విధములుగా ప్రార్థించాడు. భరతుని శోకమును గుర్తించి వశిష్టులవారు రామునకు ఎన్నియో బోధలు చేశాడు: 'తండ్రి ఆజ్ఞను నెరవేర్చావు. ఇప్పుడు తండ్రిగారు శరీరముతో లేరు. కనుక, నీవు అయోధ్యకు వచ్చి రాజ్యమును చేబట్టాల'ని చెప్పాడు. అప్పుడు రాముడు చేతులు జోడించి 'గురువర్యా! ఆడినమాట తప్పటం రామునికి తెలియదు. కనుక, నేను ఈ పదునాలుగు సంవత్సరములు అరణ్యవాసము చేసి తండ్రి ఆజ్ఞ నెరవేర్చి తదుపరి అయోధ్యకు చేరుతాన'న్నాడు. 'నన్ను క్షమించండి. గురువాజ్ఞను మీరటం కాదిది. నా సత్యమును నేను పాలిస్తున్నాను. తండ్రి అభీష్టము నెరవేర్చుటకు నా జీవితమైనా అర్పితము చేస్తాను', అన్నాడు. అంతకుముందు మిథిలాపురమందు శివధనుస్సు విరిచినప్పుడు జనకుడు వచ్చి 'నాయనా! ఈ శివధనుస్సు ఎవరు విరుతురో వారికి నా కుమార్తె సీతను ఇచ్చి వివాహము చేయాలనుకున్నాను. నా అదృష్టవశాత్తు శివధనుస్సు విరిచావు. ఇదుగో నా కుమార్తె నీకిచ్చి వివాహము

sri sathyasai vahanamrutam

చేస్తాన'న్నాడు. రాముడు దీనికి అంగీకరించలేదు. నా తల్లితండ్రుల అనుమతి, అంగీకారముతోనే నేను ఈ వివాహమునకు సిద్ధమౌదును. అంతవరకు వివాహమునకు అంగీకరించను' అన్నాడు. కడకు సీతను చూడనైనా చూడలేదు. 'తల్లితండ్రుల యిష్టమే నా యిష్టము. వారి యిష్టమునకు విరుద్ధముగా ఏమాత్రము చేయుటకు వీలుకాదు. నా శరీరము, నా మనస్సు, శరీరములోని రక్తము, తలలోని తలంపులు అన్నీ తల్లితండ్రుల ప్రసాదములే! వారి ఆజ్ఞకు నేను బద్ధుడను' అని ఖండితంగా చెప్పేశాడు. విశ్వామిత్రుడుకూడా వచ్చి అనేక విధములుగా రామునికి బోధిస్తూ వచ్చాడు. అప్పుడు రాముడు 'మాతృదేవోభవ, పితృదేవోభవ' అన్నారు. ప్రత్యక్ష స్వరూపముగా మానవాకారము ధరించిన దివ్యజ్యోతులు, తల్లితండ్రులు. అట్టి తల్లితండ్రుల ఆజ్ఞను నేను ధిక్కరించలేను. తల్లితండ్రులను తృప్తి చేయలేని మానవుడు దైవమును ఏరీతిగా తృప్తి చేయగలడు? కనుక మొట్టమొదట తల్లితండ్రులే దైవము' అన్నాడు.

**సత్యధర్మములనే పునాదులపైననే జీవితసౌధము ఆధారపడియుంటుంది**

ఇంతేకాక వేదములు 'సత్యంవద, ధర్మంచర' అని ఆదేశించాయి. సత్యమును, ధర్మమును పాటించాలి. ఈ రెండింటిని మానవుడు ఏనాడు త్యజించెనో అనాడే దేశమునకు ముప్పు వాటిల్లుతుంది. దేశముయొక్క సౌభాగ్యముగానీ జీవితముయొక్క సౌజన్యముగానీ మానవుని నడతపైనే ఆధారపడి ఉంది. మానవునికి మధురమైనది సరైన నడతయే! ఇలాంటి నీతి, నిజాయతీలను మానవుడు కోల్పోతున్నాడు. ఈ నీతి నిజాయతీలను సంరక్షించుటకు మానవుడు కంకణము కట్టుకోవాలి. పునాదులు భద్రముగా నుండినప్పుడే భవనము శాశ్వతముగా నిల్చగలదు. సత్యధర్మములనే పునాదులపైనే జీవితమనే సౌధము అభివృద్ధి గాంచుతుంది. మానవజీవితము చాలా విలువైనది. దీనిని మనం విశ్వసించదగినది. జీవితమంటే ఏమిటో చాలామంది అర్థము చేసుకోలేక పోతున్నారు. మానవజీవితమునకు మించినది, జగత్తులో మరొకటి కానరాదు. మానవుడు తన జీవితమును సత్యధర్మములచేతనే సార్థకము చేసుకోవాలి. తల్లిని గౌరవించాలి. ప్రేమ మొట్టమొదట తల్లినుండియే ఆవిర్భవించేది. ప్రతి మానవుడు పుట్టిన తక్షణమే తల్లి ప్రేమకు



srisathyasaivachanamrutam

నోచుకుంటాడు. తదుపరి అన్ని కోరికలు అతనికి ఆవిర్భవిస్తూ వస్తాయి.

## ప్రేమయే దైవము, దైవమే ప్రేమ

ప్రేమ తరువాతనే మిగిలినవన్నీ! ప్రేమయే దైవము, దైవమే ప్రేమ. ఎట్టి ప్రేమ? ప్రాకృతమైన ప్రేమకాదు. లౌకికమైన ప్రేమకాదు. జగత్సంబంధమైన ప్రేమకాదు. అస్థిరమైన ప్రేమకాదు. నిత్యమైన, సత్యమైన, నిర్గుణమైన, నిరాకారమైన, దివ్యమైన దైవప్రేమయే నిజమైన ప్రేమ. ఈనాడు దైవవిశ్వాసము, ఆత్మవిశ్వాసము లేకపోవటంచేత మానవుడు అనేక కష్టములకు గురికావలసి వచ్చింది. మొట్టమొదట ఆత్మవిశ్వాసమును మనం పెంచుకోవాలి. ఆత్మయే మన తల్లి, సర్వము ఆత్మనుండియే ఆవిర్భవిస్తున్నాయి. జగత్తులో ప్రతి మానవుడు ఆత్మస్వరూపమే! మానవుడనగా కేవలము దేహము కాదు. ఈ దేహాభిమానముచేత మానవుడు పొందవలసిన పవిత్రత పొందలేకపోతున్నాడు. దైవము ఏ బదరీనాథ్‌యందో, కేదారనాథ్‌యందో, హరిద్వారమునందో, ఋషికేశమునందో, తిరుపతియందో, ధర్మక్షేత్రమునందో లేదు. అవన్నీ ప్రాకృతమైన మనో కల్పితములే! భగవంతుడు మొట్టమొదట నీ హృదయవాసి. నీ life యొక్క controller. నీ హృదయములో ఉంటున్నాడు. కనుక, మొట్టమొదట మానవుడు మాటలు చాలించి హృదయమును తెరిపించాలి. మానవుని శిరస్సులు అనేకంగా కనిపిస్తుంటాయి. కానీ హృదయము ఒక్కటే! ఇట్టి సత్యమును గుర్తించిన ప్రతి మానవుడు మాటలు తగ్గించి హృదయమును తెరిపించాలి. ఈనాటి మానవుడు అశాంతికి గురికావటానికి కారణం ఏమిటి?

## మౌనమే జీవితమునకు మాధుర్యము

హృదయమును మూసిపెట్టి మాటలను అధికము చేస్తున్నాడు. నోరుముయ్యాలి, హృదయము తెరవాలి. అప్పుడే మనకు నిజమైన ఆనందము ప్రాప్తిస్తుంది. హృదయము మూసుకొని నోరుమాత్రం తెరచుకుంటే ఆత్మజ్ఞానం ఏమాత్రం అర్థముకాదు. కనుక, ప్రాచీన మహర్షులందరు మౌనము అనే వ్రతము పాటిస్తూ వచ్చారు. మౌనమే జీవితమునకు మాధుర్యము. నిశ్శబ్దములోని శబ్దమే బ్రహ్మము. కనుక, మానవుడు మాటలను కొంతవరకు తగ్గించుకొని హృదయాన్ని విశాలము గావించుకునే విధానము గుర్తించాలి. ఎప్పుడూ

sri sathyasai vahiniamrutam

ప్రపంచములో ప్రకాశము నందించేది హృదయమే! అట్టి హృదయము భగవంతుని నివాసము. కనుక, భగవంతుని వెతకాలనుకున్న మానవుడు తన హృదయములో వెతకాలి. అయితే బాహ్యమైన పూజలుగానీ, భజనలుగానీ, వ్రతములుగానీ యివన్నీ మానసికశాంతిని చేకూరుస్తాయి. మానవునికి మనస్సు ఉండినంతవరకు ఈ మహత్తరమైన దివ్య ప్రబోధలు ఏమాత్రము అర్థముకావు. మనస్సును మాధవునివైపు మరల్చాలి. మనము దైవతత్త్వమును గుర్తించుకోటం కష్టము. కనుక మాతృమూర్తిని మనం గుర్తించి తగిన గౌరవమునందించాలి. తల్లిని గౌరవించిన వ్యక్తికి మాత్రమే జీవితములో శాంతి లభ్యమవుతుంది. ఇట్టి పవిత్రమైన భావములు మానవునియందు అభివృద్ధి గావించుకుని మాతృమూర్తిని ముందు గౌరవించి వారి అభీష్టము గుర్తించి వర్తించటము ప్రతి స్త్రీ, పురుషుని కర్తవ్యము.

**దైవచింతనయే మానవుని ఉన్నతికి ప్రధానమైన మార్గము**

ఈనాటి మానవుడు తల్లిదండ్రులను ఏమాత్రము గౌరవించటంలేదు. వారిని కేవలం పనిమనుషులవలె భావించి పరిహసిస్తుంటారు. ఆ విధంగా చేయటంచేత మానవుడు అనేక కష్టములకు, నష్టములకు గురౌతుంటాడు. దైవము మొట్టమొదట మాతృస్వరూపములో ప్రత్యక్షమవుతుంది. ఇలాంటి పవిత్రమైన మాతృమూర్తుల గౌరవమును, మాతృమూర్తుల సందర్శనమును, మాతృమూర్తుల యొక్క అభీష్టమును కొంతవరకు నెరవేర్చి ఆనందించటానికి ప్రయత్నము చేయటమే ఈనాటి స్త్రీలదినముయొక్క ప్రధాన ఉద్దేశ్యము. మీరు మంచి స్త్రీలుగా ఉండినప్పుడే మంచిబిడ్డలు అభివృద్ధి అయి వారు తిరిగి మీ కీర్తిప్రతిష్ఠలను జగత్వ్యాప్తి గావిస్తారు. దైవ చింతనయే మానవుని ఉన్నతికి ప్రధానమైన మార్గము. జీవితమునకు రాజమార్గము, పూలబాట దైవచింతనయే! దురదృష్టవశాత్తు కాలము మారటంచేత, పరిస్థితుల ప్రభావముచేత, మానవుడు ఈనాడు దైవమును విస్మరిస్తున్నాడు. దైవ ప్రేమకు మించిన ప్రేమ ఈ జగత్తులో మరొకటిలేదు. అలాంటి ప్రేమను ఈనాడు విస్మరించాడు. తాత్కాలికమైన, క్షణభంగురమైన లౌకిక ప్రేమను ఈనాడు విశ్వసిస్తున్నాడు. మానవ జీవితమునకు దీనిని మించిన విలువ మరొకటి లేదు.

sri sathyasai vachanamrutam

## దైవసంకల్పముచేతనే సర్వ సృష్టి నడుస్తున్నాది

ఈ జగత్తునంతయు సృష్టించి పోషించి పరిపాలించి అన్ని విధముల ఉత్తీర్ణము చేసేది దైవతత్త్వము ఒక్కటే! మానవుడు దేహాభిమానమును, ధనాభిమానమును అధికారాభిమానమును పురస్కరించుకొని అనేక విధములుగా తనలో శక్తి ఉండినట్లుగా విశ్వసిస్తున్నాడు. ఇవన్నీ అస్థిరమైనవే! అనిత్యమే! దీనినే శంకరులవారు ఇలా చెప్పారు:

**మాకురు ధనజనయవ్వన గర్వం**
**హరతినిమేషాత్కాలస్సర్వం**

ఏమిటి ఈ యవ్వన గర్వము? ఈ ధనగర్వము ఏమిటి? ఈ విద్యాగర్వము ఏమటి? అధికారగర్వము ఏమిటి? ఇవన్నీ అస్థిరమైనవి, కదలిపోయే మేఘముల వంటివే! ఇవన్నీ శాశ్వతములు కాదు. దైవసంకల్పమే ప్రధానమైనది. దైవసంకల్పముచేతనే సర్వసృష్టి నడుస్తున్నాది. ఈ సత్యమును మానవుడు గుర్తించుకోలేక సర్వమును తానే సృష్టించినట్టు భావిస్తున్నాడు. ఇది ఎవ్వరి సృష్టికాదు, దైవసృష్టియే! దైవసృష్టి చిత్రము. అట్టి మహాచిత్రమైన దైవసృష్టిని ఎవరు ఏ విధంగా గుర్తించుటకు వీలవుతుంది? పచ్చని చిలుకకు ఎఱ్ఱని ముక్కు పెట్టాడు. దీనిని దేవుడు కాక ఎవరు పెట్టగలరు? నెమలి ఎంత చిత్రముగా ఉంటున్నాది! దీనికి ఎవరు పెయింటువేశారు? ఇదంతా భగవంతుని సంకల్పసృష్టియే! ఇంత సంకల్పసృష్టి భగవంతుని యందుండగా మానవుడు తానేదో చేసినట్లు భావిస్తున్నాడు. ఇది మానవుని అహంకారము. కాదు, కాదు. దైవశక్తిని విశ్వసించాలి. దైవశక్తియే మన సర్వస్వమని భావించాలి. ఏది జరిగినా దైవప్రసాదముగానే విశ్వసించాలి. దుఃఖము అతని ప్రసాదమే; సుఖము అతని ప్రసాదమే! సుఖదుఃఖములు రెండూ అతని ప్రసాదమే! రెండింటిని సమముగా భావించుకొనుటకు కృషి చేయాలి. లౌకికమైన భోగభాగ్యములు క్షణములో పోతుంటాయి. ఇది గ్రహించలేక మానవుడు అహంకారముచేతను, అసూయచేతను ఆడంబరములచేతను మానవత్వమునే పూర్తిగా విశ్వసిస్తున్నాడు. ఇదికాదు, మనము విశ్వసించవలసినది. విశ్వసించవలసినది దైవమునే! దైవశక్తిని మాత్రమే మనము విశ్వసించాలి. మానవ జీవితము అంతా జడమైన జీవితము. ఇలాంటిది చైతన్యమైన దైవముచేతనే సర్వ పనులు

srisathyasaivachanamrutam

చేయగలుగుతున్నాది.

**దైవము కారణము, జగత్తు కార్యము**

ప్రేమస్వరూపులారా! నిజమైన ప్రేమస్వరూపము తల్లిమాత్రమే! ఆ తల్లి ప్రేమను మనం పొందటానికి తగిన కృషి చేయాలి. తల్లి అభీష్టము గుర్తించటానికి తగిన కృషి చేయాలి. ఆమెను తృప్తిపరచుటకు తగిన ప్రయత్నము చేయాలి. అదే పుట్టిన ప్రతి బిడ్డకు ప్రధాన కర్తవ్యము. ప్రతి మానవుడు మాతృమూర్తిని గౌరవించాలి. అదియే ప్రధానమైన పూజ. అదే నిజమైన ఆరాధన. అదియే నిజమైన వ్రతము. అనాదికాలమునుండి భారతీయులు చేస్తూ వచ్చిన తపస్సు ఇదియే! ఈ తపస్సునందే మన మాధుర్యమైన జీవితము యిమిడి ఉంటున్నాది. ఎంతో మధురమైన జీవితము. 'వచనం మధురం, శ్రవణం మధురం, హృదయం మధురం, హస్తం మధురం, సర్వం మధురం, మధురాతిపతే మధురం మధురం'. మన సర్వాంగములను మధురమైన మార్గములో ప్రవేశపెట్టాలి. అదియే మాధవత్వమునకు తగిన గుర్తులు. బల్బులున్నాయి; వెలిగేది బల్బునా? కాదు కాదు. అందులోని కరెంటే బల్బును వెలిగిస్తున్నాది. ఫ్యాను తిరుగుతున్నాది; మనకు గాలినిచ్చేది ఫ్యానా? కాదు, కరెంటు ఫ్యానుద్వారా ప్రవహించి చల్లని గాలిని అందిస్తున్నాది. ఈ జగత్తంతా కేవలం నెగిటివ్, జడమైనది. ఇందులో సర్వశక్తిమయుడైన దైవము చైతన్యముగా రూపొంది అన్నింటిని పోషిస్తూ వస్తున్నాడు. చేతనా స్వరూపమే దైవము. చైతన్యమార్గమే దైవము. దైవము కారణము, జగత్తు కార్యము. కార్యకారణసంబంధమే ఈ సృష్టి. ఈ నెగెటివ్, పోజిటివ్ రెండు చేరినప్పుడే కరెంటు పని చేస్తుంది.

**రూప, నామములు వేరైనప్పటికి మానవులందరియందు ఉన్న ప్రేమ ఒక్కటే!**

ప్రేమస్వరూపులారా! మానవుడు పుట్టినందుకు సర్వమానవులను ప్రేమించాలి. కారణము ఏమిటి? అందరియందున్నది ఒక్క దైవత్వమే! దీనిని పురస్కరించుకునే ఉపనిషత్తులు. 'ఈశ్వరస్సర్వభూతానాం' అన్నాయి. దేహములు భిన్నభిన్నములుగా ఉండవచ్చును. రూపనామములు భిన్నము కావచ్చును. కానీ అందరియందున్న ప్రేమస్వరూపము ఒక్కటే! అదియే చేతనాస్వరూపము. కానీ దేహభ్రాంతిచేత ఈ వికార

sri sathyasai vachanamrutam

గుణములంతా అభివృద్ధి పరచుకొని నిజమైన సత్యస్వరూపాన్ని మనం మరచిపోతున్నాము. ఆ మేధాశక్తియే దక్షిణామూర్తి. దానిని పురస్కరించుకొనియే MS సుబ్బలక్ష్మి మొట్టమొదట దక్షిణామూర్తిని ప్రార్థించింది. మొట్టమొదట మన మేధస్సును పవిత్రమైన మార్గములో ప్రవేశపెట్టాలి. ఆమె మీరా వేషము వేసింది, సినిమాలో. మీరాను మహారాణా తన మందిరమునుండి బయటకు పొమ్మని చెప్పాడు. కానీ ఎక్కడకు వెడుతుంది? తన సర్వస్వము కృష్ణుడని విశ్వసించింది. ఎక్కడకు పోవుటకు వీలుకాదు. అందువలన 'చల్‌రే మన్, గంగాయమునా తీర్' అని ప్రబోధించింది. ప్రయాగకు టిక్కెట్టు book చేసుకోలేదు, ఆ యమ్మ. ఈ ప్రయాగ ఎక్కడ ఉంటున్నది? ఇడ, పింగళ, రెండూ చేరిన భ్రూమధ్యస్థానమే గంగాయమునల సంగమమైన ప్రయాగ. 'గంగయమునా నిర్మల పానీ శీతల హోవె శరీర్ చల్‌రే మన్' కర్మమార్గము, భక్తిమార్గము, ఈ రెండూ గంగాయమునలవంటివి. కర్మమార్గము నిష్కామకర్మగా ఉంటుండాలి. భక్తిమార్గము నిర్మలమైన భక్తిగా ఉండాలి. శీతలమనగా ప్రశాంతమైన తత్త్వము. ఈ అంతరార్థమును గుర్తించుకొని మీరా కృష్ణుని ప్రార్థిస్తూ వచ్చింది. కానీ, ఈనాటి పాటలలోపల పవిత్రమైన భావములు ఎవరికి అక్కరలేదు. 'గంగాయమునాతీర్, ప్రయాగకు టిక్కట్లు తీసుకుపోదాం'. ఇదే ఆలోచన. బాహ్యమైన, ప్రాకృతమైన, భౌతికమైన ఈ అభ్యాసములచేత నిత్యసత్యమైన హృదయస్థాయిని మనం విస్మరిస్తున్నాము. మొట్టమొదట భావశుద్ధిని కలిగించుకోవాలి. 'నేను', 'నేను' అనే అహంకారమును దూరము చేయాలి. నాది, నాది, అనే మమకారమును త్యజించాలి. ఈ రెండింటిని ఎప్పుడు విసర్జిస్తామో అదే త్యాగము. ఆ త్యాగజీవితమే మాధుర్యమైన జీవితము. దీనినే వేదము 'నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానసుః' అని వర్ణించింది. త్యాగముకంటె మించినది మరొకటి లేదు. మొట్టమొదట మనము త్యాగముకొరకు తగిన కృషి చేయాలి. త్యాగము ఎక్కడ మనకు ప్రాప్తిసుంది? సమాజసేవలో మనకు ప్రాప్తిస్తుంది. అందరూ అన్నదమ్ములు, అక్కచెల్లెండ్రే! ఒక్కడే తండ్రి. అతడే దైవము. అందరూ అతని అంశములే! అందరూ దైవాంశస్వరూపులే! అట్టి సత్యమును మీరు గుర్తించుకోలేకపోతున్నారు. 'దైవము ఎక్కడో ఉన్నాడు, అతనిని మనం పొందాలి' అని ప్రయత్నిస్తున్నాము. దైవము కొరకు ఎక్కడకూ పోనక్కరలేదు.

srisathyasaivachanamrutam

**హృదయవాసి అయిన భగవంతుని స్మరించినప్పుడే మనకు శాంతి లభ్యమవుతుంది**

అక్కడ, ఇక్కడ, ఎక్కడ చూచిన ఒక్కడే! ఆత్మలో మక్కువై యున్నాడు? ఎక్కడ చూచినా ఒక్కడే ఉండేది. అట్టి నిజమైన తత్త్వము ఒక్క హృదయమునందే ఉంటున్నాది. దేహము తోలుబొమ్మ:

**తైతై తైతై తైబొమ్మా!**
**దీని తమాష చూడర తోలుబొమ్మ!**
**అందము ప్రాయము ఇంద్రియశక్తియు**
**ఉందని నిక్కకురోరన్నా**
**ముందున్నదిరా తొందరలోనే**
**ముసలితనమ్మను ముసళ్ళ పండుగ ॥తై తై॥**
**మసలలేవు కనుమసకలు మోమున**
**ముడుతలు పడె తల నెరిసెనుగా**
**ముసలి కోతియని పసివారలు నిన్**
**ముసిముసి నవ్వగ కసరే బొమ్మా ॥తై తై॥**

ఏమిటిదంతా! తోలుబొమ్మ ఇదంతా! కలలో కలిగే మార్పువంటిది. ఇది కాదు. మనయొక్క స్వరూపము మార్పుచెందని ఆత్మస్వరూపమే! బాల్యము, యవ్వనము, వార్ధక్యము అన్నీ మార్పు చెందుతూనే ఉన్నాయి. కానీ ఉన్నది ఒక్కటే ఆత్మ. 'ఏకాత్మసర్వభూతాంతరాత్మ'. 'ఏక ప్రభువుకో అనేక నాం'. ఇట్టి సత్యమును మనం గుర్తించినప్పుడే మనలో శాంతి ఆనందము ఆవిర్భవిస్తాయి. ఈనాటి మానవుడు 'శాంతి', 'శాంతి', 'శాంతి', అని అలమటిస్తున్నాడు. ఎక్కడుంది, శాంతి? శాంతి బయటలేదు. మనలోపల ఉంటున్నాది. హృదయవాసి అయిన భగవంతుని స్మరించినప్పుడే మనకు శాంతి లభ్యమవుతుంది. హృదయమును విస్మరించి బాహ్యమును విశ్వసించి మనము అనేక బంధనలకు గురౌతున్నాము.

**తల్లుల గుణములు పవిత్రమైనప్పుడు జగత్తంతా పవిత్రముగా మారుతుంది**

ఆత్మస్వరూపులారా! మీరందరు బ్రహ్మస్వరూపులే! అంతా బ్రహ్మముయొక్క స్వరూపమే!

srisathyasaivachanamrutam

ఏది జరిగినా బ్రహ్మయొక్క ఫలితమే! 'అహం బ్రహ్మాస్మి' అనే సత్యమును గుర్తించండి. 'తత్త్వమసి' అది నేనే. దీనిని క్రిష్టియన్సుకూడా చెప్పారు. బైబిల్‌లో I am the messenger of God, అని చెప్పాడు. I am the son of God అని చెప్పాడు ఎందువల్ల? భగవంతుడు తండ్రి, నేను కుమారుడను. ఆ రెండింటి ఏకత్వమే I and my father are one. మన భారతదేశసంస్కృతియందు ద్వైతము, విశిష్టాద్వైతము, అద్వైతము ఈ మూడింటి ఏకత్వమే మానవత్వము. ద్వైతము-దేహము; విశిష్టాద్వైతము-మనస్సు; అద్వైతము-ఆత్మ. ఈ మూడింటి ఏకస్వరూపమే మానవస్వరూపము. ఆత్మ ప్రత్యేకంగా లేదు. అంతా తనయందే ఉంటున్నాది. జగత్తు అంతా తనలోనే ఉంటున్నది. ఈ ఏకత్వాన్ని మనం గుర్తించుకోలేకపోతున్నాము. మొట్టమొదట మాతృమూర్తి ప్రేమను గుర్తించండి. అందువల్లనే 19 నవంబరు తారీఖునందు మాతృమూర్తియొక్క ఆరాధనా దినమని, Mothers Day అని పెట్టుకున్నాము. కారణం ఏమిటి? మన జన్మకు మూలకారణము, తల్లియే! ఏ దేశ చరిత్ర చూడండి. Mother land అంటారు గానీ Father land అంటారా? మాతృభాష అంటారుగానీ, పితృభాష అంటున్నారా? మన జీవితమంతా తల్లి స్వరూపమే. నివసించే ప్రపంచమంతా తల్లియొక్క స్వరూపమే! కనుక, మనము తల్లియొక్క తత్త్వమును అర్థము చేసుకోవాలి. ఈనాడు స్త్రీల పవిత్రమైన గుణములను ప్రపంచమునకు చాటే నిమిత్తము ఏనాడో ప్రపంచమునకు ఆధారమైన ఉత్తమ పౌరులుగా తయారుచేసిన తల్లులయొక్క గుణములు మనం నేర్చుకోవాలి.

**కౌసల్య పరశక్తి గర్భమౌటను గదా**
**రాముడు దేవుడై రమణ గాంచె**
**సీతా మహాసాధ్వి చెలగి పెంచుట కదా**
**కవలు కుశలవులు ఘనులునైరి**
**జిజియా లలామ చెలగి పెంచుట కదా**
**వీర శివాజియు పేరుగాంచె**

srisathyasai vahanamrutam

**పుతలిబాయి రంజిల్లి పెంచుట కదా**
**గాంధి మహాత్ముడై ఘనతగాంచె**
**ఈశ్వరాంబాసాధ్వి యెత్తి పెంచుట కదా**
**సత్యనారాయణునకు విశ్వఖ్యాతి కలిగె**
**ప్రాణికోటి యీ విధి పరిమళించె**
**అహరహంబు బ్రోచెడి అమ్మ కంటె**
**ఆదరంబగు వస్తువు అవని కలదె**
**అమ్మ ప్రథమాక్షరంబె ఆద్యక్షరంబు**
**ప్రాణికోటికి అమ్మయె ప్రాణసమము**

అన్నింటికి తల్లులే మూలకారణము. అట్టి తల్లులయొక్క గుణములు మనము యీనాడు గుర్తించుకోలేకపోతున్నాము. తల్లుల గుణములు పవిత్రమైనప్పుడు జగత్తంతా పవిత్రముగా మారుతుంది.

ప్రేమస్వరూపులారా! రాబోయే భవిష్యత్తుకు ఆదర్శప్రాయముగా ఈనాటి బాలబాలికలు మాతృమూర్తియొక్క తత్వమును గుర్తించి, పవిత్రమైన పౌరులుగా అభివృద్ధి చెంది దేశమునకు ఆదర్శము నిరూపించాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ, నా ప్రసంగమును విరమిస్తున్నాను.

**(తేదీ 19-11-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasaivachanamrutam